నేటి నుంచి బాలాజీ ఆలయ వార్షికోత్సవాలు

దుబ్బాక, ఆగస్టు 12 : దుబ్బాక పట్టణంలో కొలువు దీరిన బాలాజీ ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ నెల 13న పుణ్యాహవాచనం, అంకురార్పణ, 14న ధ్వజారోహణం, 15న ఎదుర్కోళ్లు, 16న సామూహిక వరలక్ష్మి వ్రతాలు, 17న రథోత్సవం, 18న పూర్ణాహుతితో పాటు ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ వడ్లకొండ శ్రీధర్ తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో అర్జీలను స్వీరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు12: ప్రజావాణిలో వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు ప్రత్యేక చొరవ చూపి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కి భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లు తదితర 37 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్‌డీవో జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మౌనం వీడి.. ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 12 : పిల్లలు, మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మౌనం వీడి ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీపీ అనురాధ సూచించారు. సోమవారం కమిషనర్ కార్యాలయంలో షీ టీమ్, భరోసా సెంటర్, స్నేహిత, సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ షీ టీమ్, భరోసా సెంటర్, స్నేహిత, సిబ్బంది అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి పిల్లల, మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ల షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే దశలవారీగా ఉద్యమిస్తాం

వర్గల్ :నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

వర్గల్/చేర్యాల/రాయపోల్/కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 12: ఉద్యోగభద్రత, కనీస వేతనాలను వెంటనే పెంచాలని లేనిపక్షంలో సమగ్ర శిక్షా ఉద్యోగులంతా దశలవారీగా సమ్మెకు పిలుపునిస్తామని ఉద్యోగులు తెలిపారు. ఎస్ఎస్ఏలో పని చేస్తూ మరణించిన ఉద్యోగుల సంస్మరణ కార్యక్రమం సోమవారం ఆయా మండలాల్లో నిర్వహించారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయురాలు చాకలి ఐలమ్మ

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- వీరన్నపేటలో ఐలమ్మ విగ్రహావిష్కరణ

వీరన్నపేటలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఆగస్టు 12 : వీరవనిత చాకలి (చిట్యాల) ఐలమ్మ అన్ని వర్గాలకు ఆదర్శప్రాయురాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వీరన్నపేటలో గణపతి రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సంఘం నాయకుల తో కలిసి ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోరాటం నేటి ఆడబిడ్డలు తెలుసుకోవాలని, ఆమె ధైర్యాన్ని పుణికిపుచ్చుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రజకసా మాజికవర్గం అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. గ్రామగ్రామాల్లో చాకలి ఐలమ్మ విగ్రహాలు ఏర్పాటు చేసి నేటి తరాలకు ఆమె చరిత్ర తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, భిక్షపతి, శివశంకర్, విగ్రహదాత ఎల్లేశ్, గౌరవఅధ్యక్షుడు బాలస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్, కోశాధికారి బాలయ్య, కార్యదర్శి సిద్దయ్య, సహాయ కార్యదర్శి సిద్దయ్య, కమిటీ సభ్యులు ఆలేటి నర్సింహులు, ఆగయ్యతో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లేశంగౌడ్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ కార్యదర్శి యాదగిరి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షురాలు రంజితాకృష్ణమూర్తి, మండల మహిళా అధ్యక్షురాలు పార్వతి, రాష్ట్ర నాయకురాలు మానస, మాజీ సర్పంచ్ రేఖ, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కనకయ్య, దేవేందర్‌గౌడ్, దాసు, రజక సంఘం రాష్ట్ర నాయకులు దుర్గయ్య, నర్సింహులు, అంజయ్య, కరుణాకర్, యాదగిరి, బాలనర్సయ్య, గణపతి రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కొమురవెల్లి, ఆగస్టు 12 : మండలంలోని కిష్టంపేటకు చెందిన మాదాసు శ్రీహరి ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రోడ్డుప్రమాదంలో మృతి చెందిన శ్రీహరి పిల్లల చదువు ఖర్చులు తానే భరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే మృతుడి భార్య విద్యార్హత మేరకు ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మాజీ సర్పంచ్ బీమనపల్లి కరుణాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తలారి కిషన్ ఉన్నారు.

అంబులెన్స్‌లో పురుడు పోసిన 108 సిబ్బంది

అంబులెన్స్‌లో జన్మించిన శిశువుతో 108 సిబ్బంది

చిన్నకోడూరు, ఆగస్టు 12 : చిన్నకోడూరు మండలం మైలారం గ్రామానికి చెందిన మహ్మద్ పర్వీన్ మూడో కాన్పులో పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది టెక్నీషియన్ కిషన్, పైలట్ వెంకట్ మైలారం వెళ్లి పురిటి నొప్పులతో బాధపడుతున్న పర్వీన్‌ను అంబులెన్స్‌లో సిద్దిపేట దవాఖానకు తరలిస్తుండగా సిద్దిపేట ఎల్లమ్మ టెంపుల్‌కు రాగానే పర్వీన్‌కు పురిటినొప్పులు ఎక్కువ కావటంతో అంబులెన్స్‌లోనే ప్రసవం చేయగా ఆడ శిశువు జన్మించింది. తల్లి బిడ్డకు ప్రథమ చికిత్స నిర్వహించి సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించామన్నారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది అభినందించారు.

పారిశుధ్య కార్మికుల పీఎఫ్ డబ్బు చెల్లించాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సిద్దిపేట, ఆగస్టు 12 : పారిశుధ్య కార్మికుల పీఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గోపాల స్వామి, కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూడేండ్ల నుంచి పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయకుండా కాలయాపన చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. ధర్నా నిర్వహిస్తున్న కార్మికుల వద్దకు మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాజనర్సు వచ్చి సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకుందామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, జీ.నర్సింహులు, రాజయ్య, వినోద, రాజు, నరసింహులు, బాల్‌నర్సు, విమల, కవిత, నరసవ్వ, కుమార్ పాల్గొన్నారు.

దశలవారీగా చెల్లిస్తాం

సిద్దిపేట, ఆగస్టు 12 : పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్ డబ్బులను దశల వారీగా చెల్లిస్తామని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కార్మికులకు హామీ ఇచ్చారు. సోమవారం పారిశుధ్య కార్మికులు, సిబ్బందితో కలిసి వారు సమావేశమయ్యారు. నిధుల కొరతతో ఆన్‌లైన్‌లో ఆధార్ సీడింగ్ లేకపోవడంతో కొంత మంది కార్మికులకు ఈపీఎఫ్ నంబర్ జనరేట్ కాలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, ఇన్‌చార్జి కమిషనర్ ప్రేరణ, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ యాదగిరి, ఏఈ అన్వేష్ రెడ్డి, జేఏవో వెంకటరామస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సతీశ్, మాధవి పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

చేర్యాల పీఏసీఎస్‌లో అవిశ్వానికి అనుకూలంగా చేతులెత్తిన డైరెక్టర్లు

చేర్యాల, ఆగస్టు 12 : చేర్యాల (కొమురవెల్లి) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వంగా చంద్రారెడ్డి(బీఆర్ఎస్), వైస్ చైర్మన్ తాళ్లపల్లి నర్సయ్య(కాంగ్రెస్)పై సొసైటీ డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. జిల్లా సహకార శాఖ అధికారి కరుణ, అసిస్టెంట్ డీసీవో రఘోత్తంరెడ్డి అవిశ్వాసం ప్రకటించిన సభ్యులతో సోమవారం చేర్యాల సొసైటీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 11 మంది సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాసానికి మద్దుతుగా చేతులు లేపడంతో అవిశ్వాసం నెగ్గినట్లు అధికారులు ప్రకటించారు. అవిశ్వాసం ప్రక్రియ నెగ్గడంతో చైర్మన్ వంగా చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ తాళ్లపల్లి నర్సయ్యలు పదవులు కోల్పోయారు. కాగా గతేడాది ఏడుగురు సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రకటించగా సోసైటీ చైర్మన్ రాష్ట్ర సహకార సంఘం ట్రిబ్యునల్ ఆశ్రయించడంతో స్టే విధించింది. ట్రిబ్యునల్ విధించిన స్టే జూలై 7న ఎత్తివేయడంతో సంబంధిత శాఖ అధికారులు అవిశాస్వ ప్రక్రియ ప్రారంభించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెలలో సొసైటీకి కొత్త చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. తాత్కలికంగా చైర్మన్‌గా మేరుగు కృష్ణను ఎన్నుకున్నారు.

యువకుడి ఆత్మహత్య

రాము (ఫైల్)

ములుగు, ఆగస్టు 12 : కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం మండల పరిధిలోని కొత్తూరులో జరిగింది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామని రాము (26) మిషన్ భగీరథ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నట్లు తల్లికి చెప్పి ఇంటి పైకప్పుకు ఉరి వేసుకొన్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన భూవివాదం

అన్నను చంపిన తమ్ముడు

రాజు(ఫైల్)

అక్కన్నపేట, ఆగస్టు 12: మండలంలోని మసిరెడ్డి తండాలో సోమవారం జరిగిన భూ వివాదంలో అన్నను రోకలిబండతో తమ్ముడు కొట్టడంతో అక్కడిక్కడే చనిపోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుగులోతు రాజు(47)కు తమ్ముడు బీమా, మరో తమ్ముడి భార్య లలిత మధ్య కొంత కాలం నుంచి భూ వివాదం నడుస్తున్నది. ఈ భూ పంచాయితీ పెద్ద మనుషులతో పాటు పోలీస్ స్టేషన్ వరకు చేరినట్లు తెలిసింది. ఈ క్రమంలో తండాలో ఓ వృద్ధుడు చనిపోగా అందరూ అంత్యక్రియల్లో ఉండగా రాజు, తన చిన్నాన్నతో కలిసి ఇంటికొచ్చాడు. ఇది గమనించిన తమ్ముడు బీమా, ఆయన కుమారుడు అనిల్‌తో కలిసి రాజు ఇంట్లోకి వెళ్లి గొడవ పడ్డారు. అక్కడే ఉన్న రోకలిబండతో రాజు తల, కడుపు భాగంలో బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు వచ్చి చూసేసరికి చనిపోయాడు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితులు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. అక్కడికి చేరుకున్న హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ రాజు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించారు. మృతుడి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐఎస్ఎఫ్ జెండాల ఆవిష్కరణ

సిద్దిపేట కమాన్/హుస్నాబాద్/చేర్యాల, ఆగస్టు 12 : ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆయా మండలాల్లో పార్టీ జెండాలను ఎగుర వేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 12 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నకిష్టపూర్ శివారులో అదే గ్రామానికి చెందిన చింత ఉపేందర్, తన్నీరు గణేశ్ ఆదివారం రాత్రి అనుమతి లేకుండా ఆటోలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు కలిసి స్వాధీనం చేసుకొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, ఆగస్టు 12 : అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోహినిగడ్డా తండాకు చెందిన భూక్య నితిన్ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం పట్టుకొని బియ్యా న్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బెల్లం, పటిక పట్టివేత

అక్కన్నపేట, ఆగస్టు 12 : మండలంలోని రామవరంలో వినిశెట్టి విప్రజ్ఞ కిరాణా దుకాణంలో గుడుంబా తయారీకి ఉపయోగించే 30 కిలోల నల్లబెల్లం, కిలోన్నర పటికను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

అక్కన్నపేట, ఆగస్టు 12: మండలంలోని అంతకపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-2004 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సోమవారం పాఠశాలలో చదువుతున్న సుమారు 140 మంది విద్యార్థులకు షూలు వితరణ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛంద బంద్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 12 : బంగ్లాదేశ్‌లో జరుగుతున్న నరమేధాన్ని నిరసిస్తూ మంగళవారం సిద్దిపేటలో స్వచ్ఛంద బంద్, నిరసన ర్యాలీకి పిలుపునిస్తున్నామని హిందూ ఐక్యవేదిక నాయకులు కొత్తకొండ రాజు, గ్యాదరి రాజారామ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడుతూ.. శాంతి ర్యాలీ మంగళవారం ఉద యం 9 గంటలను నుండి వెంకటేశ్వర ఆలయం నుంచి ప్రారంభం అవుతుందన్నారు. అందురూ స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు.

పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మోకుదెబ్బ నాయకులు

కొమురవెల్లి, ఆగస్టు 12 : సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యం నర్సింహులుగౌడ్, జిల్లా అధ్యక్షుడు పచ్చిమండ్ల స్వామిగౌడ్, మండలాధ్యక్షుడు మెరుగు కృష్ణాగౌడ్ అన్నారు. సోమవారం కొమురవెల్లి మండలంలోని రసూలాబాద్ ఎల్లమ్మ ఆలయం ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 18న జరిగే సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని గ్రామగ్రామాన విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురువయ్యగౌడ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి విజయ్‌గౌడ్, జిల్లా యువజన అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, మోకుదెబ్బ జిల్లా నాయకులు పరుశరాములుగౌడ్, రమేశ్‌గౌడ్, అంజయ్యగౌడ్, మల్లేశంగౌడ్, భిక్షపతిగౌడ్, ఉప్పలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి, ఆగస్టు 12 : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మిరుదొడ్డి మండలంలో పలువురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని బీఆర్ఎస్ నాయకుడు తోట అంజిరెడ్డి అన్నారు. సోమవారం మిరుదొడ్డిలో లాల్‌గారి రాములుకు రూ.48 వేలు, మొగుళ్ల ఐలయ్యకు రూ.60వేలు, రంగమైన లక్ష్మికి రూ.12 వేలు, మగ్బూల్‌కు రూ.8వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తుమ్మల బాల్‌రాజు, గొట్టం భైరయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

దుద్దెడలో..

కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 12 : మండలంలోని దుద్దెడకు చెందిన కాట ఎల్లం గతేడాది రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వైద్య ఖర్చుల నిమిత్తం అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లగా సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.25వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కును సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పెద్దంకుల శ్రీనివాస్, మల్లమారి రవీందర్, గ్రామశాఖ అధ్యక్షుడు చిలుముల రామ్మోహన్, మాజీ ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, చిక్కుడు భానుప్రకాశ్, పల్లె బాబు, ఎండీ.ముగ్దుమ్, తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి
- మాజీన్‌పల్లిలో తీవ్ర విసాదం

ప్రమాదానికి కారణమైన డీసీఎం, లారీ

రాయపోల్ ఆగస్టు 12: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామం సమీపంలో ఘెర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరి పనిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకున్నది.తొగుట సీఐ షేక్ లతీఫ్ తెలిపిన వివరాల ప్రకారం మొక్కజొన్న కంకులను నింపుకొని చేగుంట వైపు వెళ్తున్న డీసీఎం వడ్డేపల్లి గుర్రాల సోఫో సమీపంలో అతివేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. వావాహన్ని నియంత్రించే క్రమంలో చేగుంట నుంచి గజ్వేల్ వైపు వస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీని ఢీకొట్టి బోల్తా పడింది. దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లికి చెందిన మామిండ్ల నవీన్(20) మామిండ్ల వంశీ(19) గజ్వేల్ వైపు వెళ్తుండగా డీసీఎం బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. రాయపోల్ మండలం ఎల్కల్‌కి చెందిన డీసీఎం డ్రైవర్ చాకలి రమేశ్‌కు తీవ్ర గాయాలుకాగా పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలతో ఉన్న డీసీఎం డైవర్ రాకేశ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన నవీన్, వంశీ మృతదేహలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు.మాచిన్‌పల్లికి చెందిన ఇద్ద రు యువకులు మృతి చెందడంతో సంఘట నా స్థలంలో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట సీఐ లతీఫ్ తెలిపారు.

చట్టాలపై అవగాహన

కోహెడ, ఆగస్టు 12 : మండల పరిధిలోని బస్వాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్ తదితర చట్టాలపై సోమవారం సీఐ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మయ్య, షీటీం బృందం సభ్యులు సదయ్య, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానలో దారుణం

- డెలివరీ అయిన మహిళ కుట్లు ఓపెన్
- కాటన్ పెట్టి వైద్యం

సిద్దిపేట, ఆగస్టు 12: సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో దారుణం జరిగింది. కోహెడ మండలం గుండారెడ్డిపల్లికి చెందిన అనంతారం లత భర్త పేరు అశోక్‌తో కలిసి డెలివరీ కోసం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానకు వచ్చింది. ఆగస్టు 3న వైద్యులు సిజేరియన్ చేసి డెలివరీ చేశారు. సదరు మహిళకు ఆగస్టు 9న ఆపరేషన్‌కు సంబంధించిన కుట్లు విప్పారు. శనివారం నుంచి రక్తస్రావం అయింది. రక్తస్రావం ఎక్కువై కుట్లు పూర్తిగా ఓపెన్ అయ్యాయి. దీంతో వైద్యులు చికిత్స నిమిత్తం కుట్లు ఓపెన్ అయిన గాయంపై కాటన్ పెట్టి వైద్యం చేస్తున్నారు. ఈ విషయం బయటకు రాకుండా వైద్య సిబ్బంది జాగ్రత్త పడ్డారు. ఇదే విషయంపై దవాఖాన సూపరింటెండెంట్ డా.కిశోర్‌కుమార్‌ను వివరణ అడుగగా పూర్తి స్థాయిలో వివరాలు తెలుసుకొని సదరు మహిళకు వైద్య నిపుణుల సహాయంతో వైద్యం అందిస్తామన్నారు.

భూ సమస్యల పరిష్కారంలో విఫలం

జగదేవ్‌పూర్, ఆగస్టు 12 : భూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు భట్టు దయానందరెడ్డి అన్నారు. సోమవారం రైతులకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కరించాలి కోరుతూ మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భిక్షపతి, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, కృష్ణ, రాము లు, ఎల్లారెడ్డి, ఎల్లయ్య, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ జాతీయ జెండాను ఎగురవేయాలి

ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట, ఆగస్టు 12 : ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను తమ ఇంటిపై ఎగురవేయాలని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలో బారతీయ యువ మోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న రఘునందన్ రావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ర్యాలీని సిద్దిపేట హైస్కూల్ గ్రౌండ్ నుంచి పాత బస్టాండ్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ. బీజేవైఎం నాయకులు మెహన్‌రెడ్డి, నీలం దినేశ్, సురేశ్‌గౌడ్, ఉపేందర్‌రావు, నవీన్‌తో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కొత్త ఆర్ఓఆర్

కోదండరెడ్డికి సమస్యను వివరిస్తున్న రైతులు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 11: రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని తీసు